క్లుప్తంగా

వాసుబాబు విజయం కోరుతూ ప్రార్థన



మోకాళ్లపై మేరీమాత ఆలయ మెట్లు ఎక్కుతున్న చిన్నారావు

గణపవరం (ఉంగుటూరు): ఉంగుటూరు ఎమ్మెల్యేగా పుప్పాల వాసుబాబు, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ రెండోసారి విజయం సాధించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ అభిమాని మోకాళ్లపై గౌరీపట్నం మేరీమాత ఆలయం మెట్లు ఎక్కి తన కోరిక నెరవేర్చాలని మేరీమాతను వేడుకున్నాడు. ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన చేబోయిన చిన్నారావు సోమవారం గౌరీదేవి ఆలయానికి వెళ్లి మోకాళ్లపై కొండమెట్లు ఎక్కి మేరీమాతను ప్రార్థించి తన కోరిక నెరవేర్చాలని వేడుకున్నాడు.

ఉత్సాహంగా విద్యార్థులకు శిక్షణ తరగతులు

భీమడోలు: విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం ఉత్సాహంగా విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.భీమడోలులో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాన్ని వినియోగించుకుని విజ్ఞానవంతులుగా మారి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల ఆడిట్ వాయిదా వేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో చేపడతామన్న ఆడిట్ ప్రక్రియను వేసవి సెలవుల్లో తరువాత జరిగేలా వాయిదా వేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పవ్వుల ఆంజనేయులు కోరారు. ఈ మేరకు డీఈఓ ఎస్ అబ్రహాంకు వినతిపత్రం అందజేశారు.

ఉపాధ్యాయ, పాఠశాలల సమస్యలపై వినతి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయులు, పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ జిల్లా నాయకత్వం డీఈఓ ఎస్ అబ్రహాంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పాఠశాలల నిర్వహణ గ్రాంట్లకు సంబంధించి ఆడిట్‌ను వేసవి సెలవుల అనంతరం నిర్వహించాలని, అన్ని మండలాల్లో ఒకే విధంగా 1/3 పాఠశాలను పిలిసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏలూరు జిల్లాలో జనరల్ ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్లు ఎంఈఓల ద్వారా అందజేయాలని పేర్కొన్నారు. జేవీకే కిట్స్‌ను పాఠశాల పాయింట్లకు సరఫరా చేయాలని, ముంపు మండలాలకు హెల్త్ కార్డులు ఇప్పించాలని కోరారు. 2023 వేసవి సెలవుల్లో ఇండక్షన్ ట్రైనింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు ఈఎల్ మంజూరు చేయాలని, ఎస్ఎస్‌సీ పరీక్షల డ్యూటీ చేసిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ ఇప్పించాలని పేర్కొన్నారు. సబ్జెక్ట్ టీచర్ల కొరత ఎక్కువగా ఉందని, ఎలిమెంటరీ పాఠశాలలో టీచర్లను సర్దుబాటు చేయాలని, కొన్ని పాఠశాలల్లో నిర్మాణాల పూర్తికి నిధులు మంజూరు చేయాలని కోరారు. టీచర్లు సెలవులు నష్టపోకుండా చేయాలని, ఇంటర్మీడియట్ బోధించేవారు కింది క్లాసుల సబ్జెక్టులు కూడా బోధించేలా మార్గదర్శకాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని డీఈఓ హామీ ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి, జిల్లా కార్యదర్శి ఇ.శివశంకరరావు, జిల్లా ఆడిట్ కన్వీనర్ మోహన్‌రావు, ఆడిట్ కమిటీ సభ్యులు తేరా ప్రసాద్ పాల్గొన్నారు.

15 మంది అరెస్ట్



కోడిపందాల ఆడేవారిని, వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ పరిధిలో పోణంగిలోని ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తుండగా సోమవారం ఉదయం సీఐ ఎస్ రాజశేఖర్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎస్సై నవీన్ తన సిబ్బందితో దాడి చేశారు. 15 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.30 వేలు నగదు, ఒక కోడి, 15 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశారు.

కౌంటింగ్‌కు పక్కా ఏర్పాట్లు

- నేటితో ఉత్కంఠకు తెర
- 18 రౌండ్లు లెక్కింపుతో కౌంటింగ్ పూర్తి



కౌంటింగ్‌కు ఏర్పాటు చేసిన టేబుళ్లు

దెందులూరు: ఎట్టకేలకు పోలింగ్ ముగిసిన తరువాత ఉత్కంఠతకు తెరపడింది. నేడు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఉదయం 6 గంటలకు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల (ఏలూరు) దెందులూరు నియోజకవర్గ కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి పూర్తి చేశారు. కౌంటింగ్‌కు ఉదయం 6 గంటలకు ఆధార్, ఐడెంటీ కార్డులను పరిశీలించి ఏజెంట్లు, చీఫ్ ఏజెంట్లు లోపలికి వెళ్లిన తరువాత వారందరికీ పోలీసుల మధ్య నిర్ధారణ పరీక్షలు చేస్తారు. ఉదయం 7 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రారంభిస్తారు. ఉదయం 8.30 గంటల నుంచి ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభమవుతుంది. 18 రౌండ్లు లెక్కింపుతో కౌంటింగ్ పూర్తవుతుంది. తొలి ఫలితం సుమారుగా ఉదయం 9.30 గంటలకు వచ్చే అవకాశం ఉంటుంది. చివరి రౌండ్ పూర్తయిన తరువాత సాంకేతికంగా రిటర్నింగ్ ఆఫీసర్ ధ్రువీకరణ పత్రం ఇస్తారు. ఈ ప్రక్రియ అంతా రాత్రి 9-9.30 గంటలకు పూర్తవుతుంది.

విద్యుత్ సరఫరాకి అంతరాయంలేకుండా చర్యలు

కౌంటింగ్ సెంటర్ వద్ద సాధారణ విద్యుత్ సరఫరాతో పాటు ఏదైనా విద్యుత్ అంతరాయం కలిగితే కౌంటింగ్‌కు ఇబ్బందులు జరగకుండా 63 కేవీ రెండు జనరేటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని జాయింట్ కలెక్టర్, ఆర్వో బి.లావణ్యవేణి తెలిపారు. విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్, ఇద్దరు ఏడీఈలు, ఒక ఏఈ, సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. భోజనం, తాగునీరు, మూడంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేశారు.

విజయం సాధిస్తాం

దెందులూరు ఎమ్మెల్యేగా రెండవసారి నియోజకవర్గ ప్రజలందరి దీవెనలతో విజయం సాధిస్తానని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఆయన అన్నారు.

నియోజకవర్గంలో మొత్తం పోలైన ఓట్లు	1,94,806
మొత్తం ఓటర్లు	2,24,013
మహిళలు	97,538
పురుషులు	95,360
పోలైన ఓట్లు	1,9,2901
పోస్టల్ బ్యాలెట్	1,759
హోమ్ ఓటింగ్	92
సర్వీస్ ఓటర్స్	101
పోలైన సర్వీస్ ఓట్లు	45
థర్డ్ జండర్	9

11 పోలీస్ పికెట్లు ఏర్పాటు



కె.స్వామి, దెందులూరు ఎస్సై

దెందులూరు: సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్‌లో భాగంగా జిల్లా ఎస్పీ డి.మేరి ప్రశాంతి ఆదేశాల మేరకు దెందులూరు మండలంలో 11 పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామని దెందులూరు ఎస్సై కె.స్వామి అన్నారు. సోమవారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మండలమంతా నాలుగు మొబైల్ పోలీస్ పార్టీలు పహారా కాస్తున్నాయన్నారు. అన్ని గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు జల్లెడపడుతున్నాయని వివరించారు.6వ తేదీ వరకు సెక్షన్ 30, సెక్షన్ 144 అమలులో ఉన్నాయన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు, సెల్‌ఫోన్‌లో పోస్టింగులు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, బాణసంచా కాల్చడం చేయరాదన్నారు. ఇద్దరు, ముగ్గురు కంటే ఏ ప్రాంతంలోనూ గుమ్మిగూడి ఉండకూడదన్నారు. రౌడీషీటర్ల అందరిపై పూర్తి నిఘా ఉందని, ఎవరైనా అల్లర్లు చేసినా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా ఎన్నికల కేసులో నేరస్తులుగా, రౌడీషీటర్లుగా చేయడం జరుగుతుందని ఎస్సై కె.స్వామి హెచ్చరించారు.

పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



శిక్షణకు హాజరైన నాలుగు మండలాల ఏజెంట్లు

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- క్యాంపు కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ

నిడమర్రు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహిస్తున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సూచించారు. సోమవారం బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కౌంటింగ్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో వాసుబాబు మాట్లాడుతూ కౌంటింగ్ సమయంలో నిబంధనలకు వ్యతిరేకంగా ఏదైనా ఎదురుపడితే వెంటనే సంబంధిత అంశాన్ని రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకు వెళ్లాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ హాల్లో తప్పు జరిగితే అక్కడికక్కడే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.

ఓటింగ్ యంత్రాల సీళ్లు క్షుణ్ణంగా పరిశీలించాలి

పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల సంఖ్య, ఓటు వేయడానికి వచ్చిన ఓటర్ల సంఖ్య, ఓటింగ్ యంత్రంలో నమోదైన మొత్తం ఓట్ల సంఖ్య ఫారం 17సీలో ఉంటాయని ఎమ్మెల్యే వాసుబాబు తెలిపారు. కంట్రోల్ యూనిట్ టేబుల్‌పైకి రాగానే అభ్యర్థి సీలింగ్ సెక్షన్ సక్రమంగా ఉందో లేదో కౌంటింగ్ ఏజెంట్లు పరిశీలించాలన్నారు. రిజల్ట్ సెక్షన్‌పై స్ట్రిప్ సీల్, గ్రీన్ పేపర్ సీల్ సక్రమంగా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. సీరియల్ నంబర్లు ఫారం-17సీలో నమోదు చేసినవే ఉండాలన్నారు. పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్‌ల ట్యాంపరింగ్ జరిగాయని గుర్తిస్తే పరిశీలకుని ద్వారా ఆర్వో దృష్టికి తీసుకురావాలని ఏజెంట్లకు సూచించారు. సమావేశంలో నాలుగు మండలాల కన్వీనర్లు సంకు సత్యకుమార్, దండు రాము, మరడ మంగారావు, రాయపాటి సత్తిబాబు తదితరులున్నారు.

ప్రజా తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ

- ప్రధాన సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీ వైపు
- పెరిగిన పోలింగ్‌తో పార్టీ శ్రేణుల్లో ధీమా



ఉంగుటూరులో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు (ఫైల్)

భీమడోలు/ గణపవరం: ప్రజా తీర్పుపై సర్వత్రా ఉత్కంఠతో ఎదురు చేస్తున్నారు. కౌంటింగ్ ఘడియలు సమీపిస్తుండటంతో పోటీలో నిలిచిన అభ్యర్థులు, వారి అనుచరుల్లో ఉత్కంఠ నెలకొంది. వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించడం ఖాయమంటూ 90శాతం ప్రధాన సర్వేలు చెబుతుండడంతో కూటమిలో అలజడి రేగుతోంది. గత నెల 13న సార్వత్రిక ఎన్నికలు జరగ్గా 20 రోజులు తర్వాత ఈనెల 4న మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఉంగుటూరు నియోజకవర్గంలో బెట్టింగులు రూ.లక్షల నుంచి రూ.కోట్లకు చేరాయి. వైఎస్సార్‌సీపీ విజయం వెనుక పెద్ద సంఖ్యలోనే మహిళలు, రైతులు మద్దతు తెలిపినట్లు పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా పేదలకు చేసిన మేలే తమకు శ్రీరామరక్షగా నిలుస్తాయని ఆపార్టీ శ్రేణులు ధీమాగా ఉన్నాయి. కూటమి మ్యానిఫెస్టో తమకు విజయాన్ని చేర్చుతుందని జనసేన, టీడీపీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా సంక్షేమ పథకాల లబ్ధి మహిళల ఖాతాల్లో నేరుగా జమ కావడంతో లబ్ధిదారులంతా వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టినట్లు ఆపార్టీ శ్రేణులు బాహాటంగా చెబుతున్నారు. దీనితో ఉంగుటూరు నియోజకవర్గంలో విజేతలను నిర్ణయించడంలో మహిళా ఓటర్ల కీలకంగా మారాయి. సార్వత్రిక ఎన్నికలో భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో పురుషుల కన్నా మహిళలలే ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 2,06,437 మంది ఓటర్లకు 1,81,152 మంది ఓటు వేసి 87.752 శాతం పోలింగ్ నమోదైంది. 90,476 మంది పురుషులు, మహిళలు 90,671 మంది, ఇతరులు ఐదుగురు ఓటు వేశారు. నియోజకవర్గంలో గణపవరం మినహా మిగిలిన మూడు మండలాల్లోనూ పురుషుల కన్నా మహిళలే అధికంగా ఓటును వినియోగించుకుని వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచారు. ఎన్నికల జరిగిన 20 రోజులు కావడంతో బెట్టింగులు ఒకటి, రెండు, మూడు, నాలుగు హెచ్చులంటూ బెట్టింగులు జరిగాయి. దీనితో బెట్టింగు రాజాలకు కంటిమీద కునుకు లేకుండాపోతోంది. ఇప్పటికే రెండు పార్టీల నేతలు భారీగా బెట్టింగులు కట్టారు. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంల్లో నిక్షిప్తమైంది. మరో కొద్ది గంటల్లోనే ఫలితాలు విడుదల కానుండడంతో అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

విజయోత్సవ ర్యాలీలపై నిషేధం

- ఈనెల 6 వరకూ గ్రామాల్లో 144 సెక్షన్ అమలు
- నిడమర్రు సీఐ సుభాష్



నిడమర్రులో సిబ్బందితో పోలీస్ పహారాకు సిద్ధమవుతున్న ఎస్సై శ్రీనువాస్



పత్తేపురంలో ఆటోలో అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది

నిడమర్రు: ఎన్నికల ఫలితాలు అనంతరం విజయోత్సవాలు అంటూ బాణసంచా పేల్చడం, ర్యాలీలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని సీఐ సుభాష్ హెచ్చరించారు. సోమవారం ఎన్నికల ఫలితాలు అనంతరం ఆయా గ్రామాల్లో జరిగే పరిస్థితులపై ఆరా తీసి సిబ్బంది తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు ఈనెల 6వ తేదీ వరకూ ఎన్నికల కోడ్ ఉంటుందన్నారు. గ్రామాల్లో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టులు అమల్లో ఉంటాయన్నారు. ఏ పార్టీ గెలిచినా ప్రజలు సంయమనం పాటించాలన్నారు. గొడవలు, ఘర్షణలకు దిగొద్దన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా సరే చర్యలు తప్పవన్నారు. ఎస్సై ఆర్ శ్రీనువాస్ మాట్లాడుతూ ముందస్తుగా ఎటువంటి సంఘటనలకు తావులేకుండా నిడమర్రు, బువ్వనపల్లి, అడవికొలను, పెదనిండ్రకొలను వంటి ప్రధాన సెంటర్లలో దుకాణాలు మంగళవారం తెరవకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఎక్కడా గుంపులుగా లేకుండా ఉండాలన్నారు. బైక్ సైరన్‌లు తీసేసి అధిక స్పీడ్‌తో వాహనాలు నడిపితే ఆయా వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిషేధమన్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఆటోల మైక్ ద్వారా పోలీస్ సిబ్బంది విస్తృతంగా నిబంధనలపై ప్రచారం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోరుతూ ప్రార్థనలు



నాగులదేవునిపాడు ఆర్‌సీఎం చర్చి వద్ద ప్రార్థన చేస్తున్న ఎస్.మల్లిక్



ద్వారకాతిరుమలలో మొక్కు తీర్చుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు

దెందులూరు: సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యేగా కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీగా కారుమూరి సునీల్ కుమార్ విజయం సాధించాలని వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగ పీఆర్వో ఎస్.మల్లిక్ సోమవారం నాగులదేవునిపాడు ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు తలనీలాలు ఇచ్చి పూజలు నిర్వహించారు. గుబ్బల మంగమ్మ ఆలయంలో, జోగన్నపాలెంలో కనకదుర్గమ్మ, గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి, రాట్నాలమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించి కొఠారు అబ్బయ్యచౌదరి, కారుమూరి సునీల్‌కుమార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేగా, ఎంపీగా, సీఎంగా విజయం సాధించాలని ఏసుబాబు వివరించారు.

గల్ఫ్ బాధితులకు సహాయం హర్షణీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గల్ఫ్ బాధితులకు గట్టిం మాణిక్యాలరావు సహాయం అందజేయడం హర్షణీయమని పలువురు అన్నారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చినవెల్లమిల్లి గ్రామానికి చెందిన యల్లవుల వీరమణి మలేషియాలో అనారోగ్యంతో మృతి చెందారు. అక్కడ యజమానులు నగదు చెల్లిస్తేనే మృతదేహాన్ని ఇండియాకు పంపుతామని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో ఆమె కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. మృతదేహాన్ని ఇండియాకు రప్పించాలని కోరుతూ గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు పడుతున్న వారికి సహాయం అందజేసే లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావుకు తాడేపల్లిగూడెంలో వారు వినతి పత్రం అందజేశారు. మాణిక్యాలరావు కృషి చేసి వీరమణి మృతదేహాన్ని ఇండియాకు రప్పించి ఉచితంగా అంబులెన్స్ ఏర్పాటు చేశారు. మృతదేహాన్ని చిన్నవెల్లమిల్లిలోని వీరమణి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సోమవారం వారు మాణిక్యాలరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

వారపు సంత శుక్రవారానికి వాయిదా

భీమడోలు: గుండుగొలనులో మంగళవారం నిర్వహించాల్సిన వారపు సంతను ఈనెల 7వ తేదీ శుక్రవారానికి వాయిదా వేసినట్లు ఎంపీడీవో టి.స్వర్ణలత సోమవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 4వ తేదీ మంగళవారం కౌంటింగ్ నియమావళి దృష్ట్యా 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఈనెల 6న ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా వారపు సంతను ఈనెల 7న నిర్వహించుకోవాలని సంబంధిత సంత నిర్వాహకులను ఆదేశించారు.

వైభవంగా శివునికి వెండి నాగాభరణం అలంకరణ



సత్యవోలులోని సుందరంగా అలంకరించిన స్వామివారు



స్వామివారికి వెండి ఆభరణాన్ని సమర్పించేందుకు వెళ్తున్న దాత, భక్తులు

పెదపాడు: సత్యవోలు గ్రామంలో ఇటీవల నిర్మాణం చేసిన శివాలయంలోని శివలింగానికి పెదపాడు గ్రామానికి చెందిన రెడ్డి లక్ష్మణరావు కేజీ వెండితో సుమారు రూ.లక్ష విలువైన వెండి నాగాభరణాన్ని సమర్పించారు. ఈమేరకు సోమవారం సత్యవోలు రామాలయం సెంటర్ నుంచి భక్తులు వెండి నాగాభరణాన్ని దాత తలపై పెట్టుకుని ఊరేగింపుగా బాజా భజంత్రీలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి స్వామి వారికి సమర్పించారు. స్వామివారికి వెండి ఆభరణాన్ని సమర్పించే ముందు శివునికి పంచామృతాలతోను పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, గంధం, విభూది, పన్నీరులతో అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అభినాష్ వేద మంత్రోచ్చరణలతో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుష్పాలతో స్వామిని సుందరంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు బొమ్మి ప్రభాకరరావు, కొట్నాన వెంకట్రావు, టంగుడు ఆంజనేయులు, తెంటు శ్రీనివాసరావు, రంభనాగరాజుతో పాటు ఇతర సభ్యులు గ్రామంలో పలువురు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హరికృష్ణను ఆదర్శంగా తీసుకోవాలి



కొవ్వలిలో విద్యార్థులకు హరికృష్ణ ప్రతిభా పురస్కారాలు అందజేసిన దృశ్యం

దెందులూరు: విద్యావంతుడు, ఉపాధ్యాయుడు హరికృష్ణ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి అవుతారని దెందులూరు ఎంఈవో ఎవీఎస్‌వీ ప్రసాద్, మానవత విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వలి భక్తాంజనేయ ఆలయ ప్రాంగణంలో అమ్మ సోషల్ థాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాయవాది కట్టా సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. విద్యావంతుడై, ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి అనేక మంది విద్యార్థులకు మార్గదర్శకుడైన హరికృష్ణను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు లక్ష్యాలను సాధించాలన్నారు. 2023-24లో 10వ తరగతిలో మొదటి, రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన చిరంజీవి, తనుశ్రీ, హర్షగోపాల్, పార్వతి ప్రియాంక, వీరవాణి, హరికుమార్‌కు ప్రతిభా పురస్కారం అవార్డు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ, రిటైర్డ్ హెచ్‌ఎం కస్తూరిరావు చేతులు మీదుగా 20 మంది వృద్ధులకు రూ. 18 వేలు, బియ్యం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తాఫ్ అలీ, జీవీఎల్ నర్సింహరావు చేతులు మీదుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికీ రూ.10 వేలు అందజేశారు.